# కృష్ణ, విజయ నిర్మల

## లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డ్

పుట్టిన ప్రతి మనిషి ఏదో ఒక రంగంలో పనిచేస్తారు. కానీ.. కొంతమంది ఎంచుకున్న పనికే వన్నె తెస్తారు. సూపర్‌స్టార్‌కృష్ణ, విజయ నిర్మల. ఈ పేర్లు ప్రస్తావించకుండా భారతీయ చలనచిత్ర పరిశ్రమ గొప్పతనాన్ని చెప్పడం సాధ్యం కాదంటే అతిశయోక్తికాదు. ఇక తెలుగు సినిమా చరిత్రలో వీరి పాత్ర చెప్పాలంటే అది సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రస్థానం. ఒకరు తిరుగులేని సూపర్‌స్టార్, మరొకరు కళారంగంలో స్త్రీ శక్తిని, సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన స్టార్.
ఒక్క మాటలో చెప్పాలంటే ఎంచుకున్న రంగంలో ఇద్దరూ ఇద్దరే.

1943 మే 31న గుంటూరు జిల్లాలో బుర్రిపాలెం అనే ఒక మారుమూల గ్రామంలో వీరరాఘవయ్య, నాగరత్నమ్మ దంపతులకు జన్మించిన ఘట్టమనేని శివరామకృష్ణ, సూపర్‌స్టార్‌కృష్ణగా ఎదగడంలో ఎన్నో ఎత్తుపల్లాలు.. ఒడిదుడుకులు.. ఇంకెన్నో సాహసాలు. ఏలూరు సిఆర్‌రెడ్డి కళాశాలలో డిగ్రీ చదువుతున్నపుడు, చేసిన పాపం కాశీకి వెళ్లినా అనే నాటకంతో మొదలైన నటనాభిలాష, 1965లో తేనెమనసులు సినిమాతో హీరోగా వెండితెరకు చేరింది.
బంగారు వర్ణంతో మెరిసిపోతూ.. సన్నని మీసకట్టుతో.. అమాయకంగా, అందంగా ఇంట్లో పెద్దకొడుకులా కనిపించే కృష్ణను చూసి తెలుగు ప్రేక్షకులు మురిసిపోయారు.
మోగిపోయే ఆ గొంతు విని ముగ్ధులైపోయారు.
అతను కళ్లెర్రజేసి డైలాగ్‌చెపితే అగ్నిపర్వతం బద్దలైనంత ఫోర్స్...
సీతారామరాజు గెటప్‌వేసినా...

సింహాసనం మీద కూర్చున్నా..
కౌబాయ్‌గా కనిపించినా... జేమ్స్ బాండ్‌గా మెరిపించినా...
చారిత్రకం, పౌరాణికం, జానపదం, సాంఘికం ఏ జానరైనా, ఏ పాత్ర వేసినా అది సూపర్‌హిట్... అందుకే అతను టాలీవుడ్‌సూపర్‌స్టార్‌అయ్యారు.

హీరోగా కృష్ణ చేసిన తొలి చిత్రమే తెలుగులో పూర్తిస్థాయి కలర్‌లో తీసిన తొలి సాంఘిక చిత్రం. ఇదొక్కటే యాధృచ్చికంగా జరిగింది. ఆ తర్వాత ఆయన ఎన్నో విషయాల్లో తొలివ్యక్తిగా నిలిచారు. సాహసానికి చిరునామాగా పేరు తెచ్చుకున్న ఈ బుర్రిపాలెం బుల్లోడు తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో ఆవిష్కరణలకు నాంది పలికారు. ఈస్ట్‌మన్‌కలర్, కలర్‌స్కోప్, 70 ఎమ్ఎమ్, డిటిఎస్‌సౌండ్ సిస్టమ్‌వంటి ఆధునిక సాంకేతిక పోకడల్ని  టాలీవుడ్‌కి పరిచయం చేసింది ఈ నటశేఖరుడే. ఇక తెలుగువారికి తొలి జేమ్స్ బాండ్, తొలి కౌబాయ్‌ఆయనే. ఒకే ఏడాది హీరోగా 18 సినిమాలు రిలీజైన ఏకైక సూపర్‌బిజీ సూపర్‌స్టార్‌ఆయననొక్కరే. కెరీర్లో 25సార్లు ద్విపాత్రాభినయం, 7 సార్లు త్రిపాత్రాభినయంతో అలరించిన ఈ సూపర్‌స్టార్17 చిత్రాలు డైరెక్ట్ చేశారు. డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్‌గా సేవలందించడంతో పాటు పద్మాలయా బ్యానర్‌పై తెలుగు, హిందీ, తమిళంలో ఎన్నో మరపురాని చిత్రాలను నిర్మించారు.

తొలినుంచీ కాంగ్రెస్‌అభిమానిగా ఉన్న కృష్ణ రాజకీయాల్లోనూ అడుగుపెట్టారు. 1989లో ఏలూరు నుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. రాజీవ్‌గాంధీ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చిన కృష్ణ రాజీవ్‌మరణంతోనే రాజకీయాలు వదిలేశారు. పూర్తిగా సినిమాలపైనే దృష్టి పెట్టి ఐదుపదులు దాటిన తర్వాత కూడా మెగా హీరోలతో పోటీపడి రెండు సార్లు సంక్రాంతి విన్నర్‌ట్రోఫీ ఎత్తుకుపోయారు.

ఇండస్ట్రీలో పట్టుదలతో కష్టపడితే పెద్ద హీరో అనిపించుకోవచ్చు కానీ... మంచి మనిషి అనిపించుకోవడం అందరికీ సాధ్యం కాదు. కృష్ణ అది సాధించారు. అందుకే ఆయన రియల్‌లైఫ్‌లోనూ సూపర్‌స్టార్‌గా నిలిచారు.

వెండితెరపై కృష్ణ విజయనిర్మల 'సాక్షి' వేదికగానే పరిచయమయ్యారు.
1967లో సాక్షి చిత్రంలో తొలిసారి జంటగా నటించిన వీరిద్దరూ ఆ తర్వాత నిజజీవితంలోనూ ఒకటయ్యారు. తమ కెరీర్‌లో 47 చిత్రాల్లో కలిసి నటించారు.
11 యేళ్ల వయసులో పాండురంగ మహత్యం చిత్రంతో బాలనటిగా వెండితెరకు పరిచయమయ్యారు విజయనిర్మల. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో రెండువందలకు పైగా చిత్రాల్లో హీరోయిన్‌గా నటించి తిరుగులేని గుర్తింపు సాధించుకున్నారు. నటనకు మాత్రమే పరిమితం కాకుండా, తనలో ఉన్న దర్శకత్వ ప్రతిభతో ఆణిముత్యాల్లాంటి సినిమాలను తెరకెక్కించి ప్రేక్షకుల మెప్పుపొందారు. 44 చిత్రాలకు దర్శకత్వం వహించి గిన్నీస్ బుక్‌ఆఫ్‌వరల్డ్ రికార్డ్స్ లో చోటు సంపాదించుకున్నారు.

350కిపైగా చిత్రాల్లో నటించిన కృష్ణ తెలుగు సినిమా చరిత్రలోనే ఆ ఘనత సాధించిన ఏకైక కథానాయకుడిగా చరిత్ర సృష్టిస్తే... ప్రపంచంలోనే అత్యధిక చిత్రాలకు దర్శకత్వం వహించిన మహిళగా విజయనిర్మల అరుదైన ఘనతను సాధించారు.
వెండితెరపై ఈ కళాజంటది అర్ధశతాబ్దపు ప్రయాణం. కళకు అంకితమై తెరకు గౌరవం పెంచిన ఈ దంపతులను సాక్షి ఎక్స్‌లెన్స్‌అవార్డ్స్2017 జీవితసాఫల్య పురస్కారంతో సత్కరించడం గొప్ప గౌరవంగా భావిస్తోంది సాక్షి.